# పులోమి



భృగు మహర్షి ప్రాతః సంధ్యాసమయంలో స్నానార్థం బయలుదేరబోతున్నాడు. నిత్య యౌవనుడు, తేజోరాశి అయిన భర్తకేసి పులోమి చూస్తూ నిలబడింది. ఆ మహర్షికి అసాధ్యమయింది ఏదీ లేదని ఆమెకు పూర్తి నమ్మకం. అతని శక్తిని, అపారమైన జ్ఞానాన్ని ఏ స్త్రీ అయినా అంచనా వేయలేదని ఆమె అభిప్రాయం. అటువంటి మహాపురుషునికి ధర్మపత్ని కావడం తన మహాభాగ్యం అనుకుంటూ మహర్షికేసి పరిశీలనగా చూస్తోంది పులోమి. గంభీరమైన అతని ముఖాన్ని, విశాలమైన ఫాలభాగాన్ని, తీర్చిదిద్దిన, కొనతేరిన నాసికను చూస్తుంటే ఎప్పటి కప్పుడు కొత్తగా చూస్తున్న అనుభూతి కలుగుతోంది ఆమెకు. తననే పరీక్షగా చూస్తున్న భార్యని గమనించాడు భృగుమహర్షి.

"అగ్ని గృహంలో అగ్నులు సిద్ధం చేయి" అన్నాడు ఆమెతో. నిండు గర్భవతి పులోమి. రోజు రోజుకూ తేజోవంతంగా కనిపిస్తున్న ఆమెను చూస్తే ఎంతో ఆనందం కలిగింది భృగుమహర్షికి. గర్భవతులైన స్త్రీలు పాలిపోయిన చెక్కిళ్ళతో, శరీరాకృతి చెడి అందవికారంగా ఉంటారనే లోకపు వాడుకను భిన్నంగా ఉంది పులోమి. తన భార్య సౌందర్యం ద్విగుణీకృతమవటం

ఆశ్చర్యంగా ఉంది మహర్షికి. ఆమె పట్ల తన అనురాగమూ ద్విగుణీకృతం అవుతోంది కదా! అప్రయత్నంగా సమీపించాడు ఆమెను. మెరిసిపోతున్న ఆమె చెక్కిళ్ళను స్పృశిస్తూ, చుబుకం పట్టుకుని అన్నాడు:

"నిండు గర్భవతివి. ఈ నిత్యకార్యక్రమాలు చేయటానికి నీకు బడలికగా లేదూ?" అతని చేతులు అమె నిండైన బాహువులపై నిలచాయి. ఆ స్పర్శకి పులకించింది. చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి.

"లేదు స్వామీ! మీ స్పర్శ నాకు అనంతమైన శక్తినిస్తుంది. మీ అనురాగం ఎప్పుడూ కంటికిరెప్పలా కాపాడుతుంది నన్ను." నుదుట పట్టిన చెమట బిందువుల్ని తుడుచుకుంది పులోమి. భృగుమహర్షి స్నానార్థం ఆశ్రమం వదిలి నది వైపు నడిచాడు.

శ్రద్ధతో, భక్తితో అగ్ని గృహాన్ని పరిశుభ్రంచేసింది పులోమి. అగ్నుల్ని సిద్ధం చేసేసింది. ఒక్కమారు అగ్నిగృహమంతా కలయజూసి తృప్తిగా నిట్టూర్చింది.

అకస్మాత్తుగా ఒక ఆకారం అగ్ని గృహంలో ప్రవేశించటంతో పులోమి నిశ్చేష్ట అయింది. నిట్టనిలువైన వెంట్రుకలు, ఎర్రని గుడ్లు, నల్లని, వికృతమైన ఆకారం భయంకరంగా అటూ ఇటూ సంచరిస్తుంటే గజగజ వణికిపోయింది భయంతో. గర్భస్థ శిశువు కదలిక ఆగిపోయిందా అనిపించిందామెకు. ఆ రాక్షసుడి అడుగుల తాకిడికి భూమి అంతా ప్రకంపిస్తోంది.

నిండు గర్భవతి అయి, సౌందర్య రాశిలా ఉన్న పులోమివంక చూశాడు రాక్షసుడు. ఆమె సౌందర్యం అతన్ని ఉన్మత్తుణ్ణి చేస్తోంది. అగ్ని గృహమంతా పరిశీలనగా చూశాడు.

"ఎవరీమె?" అగ్నిహోత్రుణ్ణి ప్రశ్నించాడు. ఆ భయంకర ధ్వనికి ఆ అగ్నిగృహమంతా దద్దరిల్లిపోయింది ఒక్కసారి.

అగ్నిదేవుడు సందిగ్ధావస్థలో పడ్డాడు. తెలిసి ఉన్న విషయం చెప్పకపోతే అది అబద్ధం చెప్పినట్టే. నిజం చెబితే మునివల్ల శాపం తప్పదు. శాపాన్ని ఉపసంహరించుకోమని మునిని ప్రార్థించవచ్చేమో కాని, అనృతదోషంవల్ల వచ్చే పాపాన్ని తప్పించుకోలేనని వ్యాకులత చెందాడు. పాపభీతి అగ్నిదేవుణ్ణి మరీ భయపెడుతోంది.

"జాతవేదా! ఎవరీమె?" రాక్షసుడి కంఠం పిడుగుపాటులా వినిపించింది.

"ఈమె భృగుమహర్షి భార్య - పులోమి." వెంటనే అన్నాడు.

రాక్షసుడు గుడ్లు మిటకరించాడు. కళ్ళనుంచి నిప్పులు కురిపించాడు. ఈ రాక్షసుడు పులోముడు. ఆమె సౌందర్యాతిశయాన్ని, ఆమె గుణగణాల్ని విని వివాహం చేసుకోవాలనుకున్నాడు. కానీ, ఈమెను భృగుమహర్షి వివాహమాడటంతో విఫలీకృతుడయ్యాడు. ఒకనాటి తన ఓటమి, ఈనాటి ఆమె సౌందర్యం రాక్షసుణ్ణి మరీ రాక్షసుణ్ణి చేశాయి. అగ్ని గృహంలో ఓ మూలగా ఒదిగి ఉన్న పులోమిని సమీపించాడు. వరాహంగా మారి ఆమెను నెత్తిన పెట్టుకుని వేగంగా పరుగుతీశాడు రాక్షసుడు. ఈ హఠాత్సంఘటనతో పులోమికి గర్భచ్యుతి కలిగింది. కానీ, విచిత్రం! ఆ గర్భచ్యుత శిశువు మహా తేజోరాశి! ఆ కాంతిని నిశాచరుని కళ్ళు చూడలేకపోయినాయి. ఆ కాంతి జ్వాలలో ఆ క్షణంలో భస్మీభూతుడయ్యాడు రాక్షసుడు పులోముడు.

ఆనందంతో ఆ తేజఃపుంజాన్ని ఒళ్ళోకి తీసుకుని, త్వరత్వరగా ఆశ్రమంలోకి ప్రవేశించింది పులోమి. ఆమె కళ్ళు కన్నీళ్ళతో నిండిపోయాయి.

స్నానానంతరం ఆశ్రమంలోకి వచ్చిన భృగుమహర్షి పులోమి ఒడిలోని పసికందును చూశాడు. తన సంతానానికి మూర్తృమూర్తి. తనకు ధర్మపత్ని పులోమి కావటం తన అదృష్టం అనుకుంటూ, ఆ తేజోరాశిని తన చేతిల్లోకి తీసుకుని తన్ను తాను మరిచిపోయాడు ఆ క్షణం మహర్షి.

పుత్ర జననోత్సవం నుంచి తేరుకుని, తను స్నానార్థం వెళ్ళి వచ్చే లోపల జరిగిన విశేషాలేమిటని ప్రశ్నించాడు భార్యను. పులోముడి రాక, అగ్నిదేవుడు తనను రాక్షసుడికి తెలియచెప్పటం, వరాహమైన రాక్షసుడు తనను ఎత్తుకుపోవటం, గర్భచ్యుతి, పుత్ర జననం, రాక్షస మరణం-అన్నీ వివరంగా గద్గదస్వరంతో, భయం భయంగా తెలుపుతూ భర్త బాహువుల్లో తలదాచుకుంది పులోమి. ఆమెను ఓదార్చాడు మహర్షి. తాను లేని సమయంలో భార్యకు కలిగిన ఆపదకు చింతించాడు. కానీ, అగ్నిదేవుడు రాక్షసుడికి తన భార్యను గురించి తెలియపరచటం మహర్షికి చాలా ఆగ్రహాన్ని కలిగించింది. వెంటనే అగ్నిహోత్రుణ్ణి ఆవాహనం చేసి ప్రశ్నించాడు. అగ్నిహోత్రుడికి తెలుసు మహర్షి శక్తి. భయపడుతూనే, అబద్ధం చెప్తే వచ్చే పాపానికి వెరిచి అలా చెప్పానని వినయంగా మనవి చేసుకున్నాడు అగ్ని తనకు కలిగే పాపభీతివల్ల తన భార్యను

ఆపద కలిగించాడని అర్థమయిన భృగుమహర్షి అగ్నిదేవుణ్ణి క్షమించలేక పోయాడు. అతని సమాధానం సకారణంగా కనిపించలేదు మునికి. వెంటనే 'సర్వభక్షకుడివి క'మ్మని ఆగ్రహంతో శపించాడు భృగుమహర్షి.

భృగుమహర్షి శాపం శాసనమే! దానికి తిరుగులేదు. ఈ శాపం లోకానికే శాపమైంది. దేవతలకు, పితృదేవతలకు అందరికీ చెందే నైవేద్యాలు అగ్ని ముఖంగా చెందవలసిందే. తనే సర్వభక్షకుడై, అశుచి అయితే అందించవలసిన నైవేద్యాలు పవిత్రంగా అందించగలడా తను? పితృ కార్యాల ప్రయోజనం ఆగి పోక తప్పదు కదా! తప్పుచేయటం కన్నా నిశ్చలుడై ఉండటం మంచిదని తలచిన అగ్నిహోత్రుడు తన తేజస్సును ఉపసంహరించుకున్నాడు.

లోకాలు అల్లకల్లోలమయ్యాయి. బ్రహ్మదేవుడితో మొర పెట్టుకున్నారు దేవతలు. భృగుమహర్షి శాపానికి తిరుగులేదనీ, ధర్మపత్ని పట్ల అతనికున్న ప్రేమకి బద్ధుడై అతను అగ్నిని శపిస్తే, అందుకు తనేమీ చేయలేనని కూడా బ్రహ్మదేవుడికి తెలుసు. అయినా దేవతల ప్రార్థన బ్రహ్మను మార్గాంతరాన్ని ఆలోచింపజేసింది.

'విశ్వంలో అగ్ని కార్యాలు స్తంభించిపోకుండా చూడాలి' అనుకున్నాడు. సర్వభక్షకుడైనా అగ్నిభట్టారకుని శుచిత్వానికి ఏమాత్రం లోపం రాకుండా ఉండే వరాన్ని బ్రహ్మ అగ్నిదేవుడికి ప్రసాదించాడు.

పసికందు చ్యవనుడు తన ఒడిలో వెలుగు విరజిమ్ముతుంటే, "స్వామీ, మీరిచ్చిన శాపం ఎంతపని చేసిందో చూశారా?" అంది పులోమి భర్తవైపు గోముగా చూస్తూ.

"నీమీది ప్రేమతోనే ఆ శాపమిచ్చాను. కానీ, ఆ శాపం లోకకల్యాణానికి దారితీసిందిగా! అయినా నా భార్యకు ఆపద కలిగిస్తే ఎవరినైనా క్షమించను. ఎవరైనా శాపగ్రస్తులు కావలసిందే! నా ప్రియపత్ని కోసం నేను ఏమైనా చేయగలను."

మహా తపస్సంపన్నుడైన భృగుమహర్షికి తనంటే ఉన్న ప్రేమకీ, అనురాగానికీ తన్మయత్వం చెందింది పులోమి. *

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం : ఆదిపర్వం : ప్రథమాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక : 21-8-1987)